ప్రజాశక్తి

శుక్రవారం 20 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

7295 బస్సులు.. 5 లక్షల మంది ప్రజలు

- యోగా డేకు భారీగా జన సమీకరణ
- సచివాలయం యూనిట్‌గా వాహన కేటాయింపులు
- 26 కిలోమీటర్ల మేర యోగా విన్యాసాలు
- యోగాంధ్ర ఏర్పాట్లపై సమీక్షల్లో మంత్రులు నారాయణ, డోలా

ఏర్పాట్ల కమిటీలతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఈ నెల 21న యోగాంధ్ర కార్యక్రమానికి తరలివచ్చే లక్షలాది మంది ప్రజలకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పకడ్బందీగా చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. సుమారు ఐదు లక్షల మంది ప్రజలు విశాఖకు తరలివస్తారన్న అంచనా ఉండటంతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తోంది. 7295 బస్సులను జన సమీకరణకు సిద్ధం చేసినట్టు వెల్లడించింది. మరోపక్క విశాఖలో గురువారమంతా రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వరుస సమీక్షలు జరిపారు. ఆయుష్ శాఖ, విశాఖ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఉదయం ఎయు కన్వెన్షన్ హాలు నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాలు వరకు యోగా వాక్‌థాన్ కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో డోలాతో పాటు మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత పాల్గొన్నారు.

తొలుత టిడిపి విశాఖ జిల్లా కార్యాలయంలో నారాయణ సహచర మంత్రులతో కలిసి పార్టీ నేతలకు పలు అంశాలపై సూచనలు చేశారు. శనివారం ఉదయం 6.30కి యోగా డే కార్యక్రమం ప్రారంభం కానుండటంతో 5.30లోపు ప్రజలంతా వారికి కేటాయించిన కంపార్ట్మెంట్‌లకు చేరుకునేలా చూడాలన్నారు. 5.45 గంటల తర్వాత ప్రజలను అనుమతించడంలో ఇబ్బందులు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.

ఆ తర్వాత ఎయు కన్వెన్షన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకున్న మంత్రి నారాయణ రవాణా, ఫుడ్ కమిటీలోని సభ్యులతో మిగతా 2లో..

'ఉక్కు'పై ప్రధాని స్పందించాలి

సిఐటియు విశాఖ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రధాని మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. అన్యాయంగా తొలగించిన నాలుగు వేల మంది కాంటాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు, అక్రమ తొలగింపులు ఆపివేసేందుకు, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20, 21 తేదీల్లో విశాఖలో పర్యటించనున్న మోడీతో పై ప్రకటనలు చేయించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు చొరవ చూపాలన్నారు. ఉక్కు ఉద్యమంపైనా, కార్మికులపైనా రాష్ట్ర కూటమి ప్రభుత్వ నిర్బంధాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కార్మికులు, ప్రజలు నాలుగున్నర సంవత్సరాలుగా చేస్తున్న పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రూ.11440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందన్నారు. అయితే, అందులో జిఎస్‌టి పేరుతో రూ.500 కోట్లును లాగేసుకుందని, రూ.9346 కోట్ల మేర బ్యాంకులు, ఇతర పాత బకాయిలు తీర్చిందని తెలిపారు. మిగిలిన రూ.1594 కోట్లను విడుదల చేయకుండా అనేక ఆంక్షలు పెడుతోందన్నారు. ప్యాకేజీ నిధులను ప్లాంట్ అభివృద్ధికి వినియోగిస్తే ఉక్కు ఉత్పత్తి పెరిగేదని, ప్రభుత్వాలకు పన్నులు ద్వారా ఆదాయం వచ్చేదని, ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన ఉక్కు లభించేదని అన్నారు. ఉక్కు పరిరక్షణపై రాష్ట్రంలోని కూటమి పాలకులు ఎన్నికల నాటి హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలన్నీ గమనిస్తే కేంద్రం ఇచ్చిన ప్యాకేజీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో బలోపేతం చేసేందుకు కాదని, ప్రయివేటుకు కట్టబెట్టే కుట్రలో భాగమని తేలుతోందన్నారు. నాడు ప్రకటించిన ప్యాకేజీ నిధుల్లో ప్లాంటు ముడి సరుకుకు, అదనపు యంత్రాలకు, ప్రస్తుత యంత్రాల మరమ్మతులకు, కార్మికుల జీతభత్యాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయరాదని ఆంక్షలు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. స్టీల్‌ప్లాంట్ లాభాల బాటపట్టాలంటే సొంత గనుల కేటాయింపు ఎంతో అవసరమన్నారు. సొంత గనులు లేక విశాఖ ఉక్కు ప్రతి టన్ను ఉత్పత్తికి రూ.4 వేల నుంచి రూ 6 వేలు అదనపు ఖర్చు భరిస్తూ నష్టాల బారిన పడుతోందన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు కేంద్రం సొంత గనులు కేటాయించిందని తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఇంకా ప్లాంట్ నిర్మాణమేకాని ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని, మిగతా 2లో..

నేడు, రేపు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

వార్త 7లో..

ఎయుకు బ్రెస్ట్ కేన్సర్ ఔషధంపై పేటెంట్

వార్త 3లో..

సిజిహెచ్‌ఎస్ సమస్యలు పరిష్కరించాలి

వార్త 4లో..

బదిలీల్లో పారదర్శకత ఏదీ ?

కెజిహెచ్ ఎదుట హెడ్ నర్సుల నిరసన

నిరసన తెలుపుతున్న హెడ్ నర్సులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల జరిగిన వైద్య ఆరోగ్యశాఖ హెడ్ నర్సుల బదిలీల్లో పారదర్శకత లోపించిందని, ఈ నేపథ్యంలో ఇప్పటికే జరిగిన కౌన్సెలింగ్‌ను రీ కాల్ చేసి ఆఫ్ లైన్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నగరంలోని పలు ప్రభుత్వ ఆసుపత్రుల కు చెందిన హెడ్ నర్సులు కెజిహెచ్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50 సంవత్సరాలు దాటిన ఉద్యోగులను వయస్సు ప్రాతిపదికన ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీలు చేయరాదని, కానీ 58 సంవత్సరాలు దాటిన సుమారు 55 మంది మహిళా సిబ్బందిని విశాఖ నుండి ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమలో కొంతమందికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, అదే విధంగా ఉద్యోగ విరమణకు కూడా అతి తక్కువ సమయం ఉందని, అయినప్పటికీ తమ విజ్ఞాపనను పరిగణలోకి తీసుకోకుండా వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి ఏకపక్షంగా కౌన్సెలింగ్ మిగతా 2లో..

మిన్నంటిన రోదనలు

- మావోయిస్టుల మృతదేహాల కోసం కుటుంబీకుల పడిగాపులు
- హైడ్రామా నడుమ అప్పగించిన పోలీసులు
- నేడు కరకవానిపాలెంలో అరుణ అంత్యక్రియలు

ఆసుపత్రి వద్ద పడిగాపులు కాస్తున్న మృతుల బంధువులు

ప్రజాశక్తి - రంపచోడవరం, ఎంవిపి.కాలనీ

రంపచోడవరం ఏజెన్సీలో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో మృతిచెందిన మావో యిస్టుల మృతదేహాలకు రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతుల కుటుంబీకులకు అందజేసే క్రమంలో గురువారం తీవ్ర హైడ్రామా నడిచింది. తమ వారిని కడసారి చూసుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వేకువజామునకే రంపచోడవరానికి తరలివచ్చిన మావోయిస్టుల బంధుమిత్రులకు పడిగాపులు తప్పలేదు. రోజంతా వారు ఏడుస్తూనే ఉన్నారు. పోస్టుమార్టం నిర్వహించేందుకు ఫోరెన్సిక్ అధికారులు రావాలంటూ పోలీసులు సాయంత్రం వరకూ కాలయాపన చేశారని వారు వాపోయారు. ఇదిలా ఉండగా రంపచోడవరం డిఎస్‌పి సాయి ప్రశాంత్ స్పందిస్తూ మావోయిస్టుల మృతదేహాలను చూసేందుకు అనుమతి ఇవ్వలేదన్న వార్తలు నిజం కాదని అన్నారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరమే మృతదేహాలను బంధువులకు అప్పగించాలని వచ్చిన పై ఆదేశాల మేరకు తాము నడుచుకున్నామని తెలిపారు.

కరకవానిపాలెంనకు చెందిన అరుణ (ఫైల్ ఫొటో)

అరుణ అంత్యక్రియలకు ఏర్పాట్లు

గురువారం రాత్రి 9 గంటలకు మావోయిస్టు పార్టీ సీనియర్ నాయకురాలు అరుణ మృతదేహానికి పోస్టు మార్టం పూర్తయింది. దీంతో ఆమె కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు. అరుణ అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన విశాఖ జిల్లా కరకవానిపాలెంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని అమరవీరుల బంధుమిత్రులు, కుటుంబీకులు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

బీచ్ రోడ్డులో వాక్‌థాన్‌లో పాల్గొన్న మంత్రులు

7295 బస్సులు.. 5 లక్షల మంది ప్రజలు

సమావేశయ్యారు. ఒక్కో సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రజలకు రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. 7295 బస్సులను ప్రజల కోసం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే బస్సులను ఒకేసారి కాకుండా ట్రాఫిక్‌కు తగినట్లుగా చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత విశాఖపట్నం పోలీస్ కమిషనర్ సంకబ్రత బాగ్చీతో సమావేశమయ్యారు. పెద్ద ఎత్తున బస్సుల్లో ప్రజలు తరలి వస్తుండటంతో తగిన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఒకేసారి బస్సులు వచ్చే అవకాశమున్నందున ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని సూచించారు. కార్యక్రమం ముగిసి తిరిగి వెళ్లేటప్పుడు కూడా బస్సులను ట్రాఫిక్‌కు అనుగుణంగా పంపించాలన్నారు. అనంతరం మంత్రులు పార్థసారథి, దుర్గేశ్, అధికారులతో కలిసి కంపార్ట్మెంట్ ఇన్చార్జిల మీటింగ్‌కు నారాయణ హాజరయ్యారు.

'ఉక్కు'పై ప్రధాని స్పందించాలి

ఇనుప ఖనిజం అంతరాయం లేకుండా పైపుల ద్వారా సరఫరా చేయాలని స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోడీని కోరారన్నారు. అదే సమయంలో ఆయన విశాఖ ఉక్కుకు గనులు కేటాయించాలని మాత్రం అడగలేదన్నారు. గనుల కేటాయింపు ఇష్టంలేకపోతే విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలన్నది కార్మికుల, ప్రజల డిమాండ్‌గా ఉందన్నారు. త్వరలో ప్లాంట్‌లోని మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించి పూర్తి ఉత్పత్తి చేస్తామని ప్రకటించిన కేంద్రం ఉత్పత్తికి అవసరమైన పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను మాత్రం వేల సంఖ్యల్లో తొలగిస్తోందని అన్నారు. పూర్తి స్థాయిలో కార్మికులు లేకుండా ఉత్పత్తి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఆఫీసర్లకు, పర్మినెంటు కార్మికులకు ఎనిమిది నెలలుగా పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించడం లేదన్నారు. సమస్యలపై ప్రశ్నించిన యూనియన్ నేతలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్ల వేటు వేయడం చేస్తోందన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలన్నారు.

బదిలీల్లో పారదర్శకత ఏదీ ?

నిర్వహించారని అన్నారు. ఆ సమయంలో తమను మాట్లాడనీయకుండా కంప్యూటర్‌ను మ్యూట్ చేసి బదిలీలు తమకు నచ్చినట్టే చేస్తామని, వెంటనే బదిలీ ఆమోద పత్రాలు తీసుకోవాలని తమపై ఒత్తిడి తీసుకువచ్చారని తెలియజేశారు. అదేవిధంగా తక్కువ వయసు ఉన్న కొందరు ఉద్యోగులకు పై అధికారుల ఒత్తిడికి లోబడి వారికి నచ్చిన ప్రాంతాలకు బదిలీలు ఇచ్చారని ఆరోపించారు. స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వకుండా బయట నుంచి వచ్చిన వారికి నగరంలో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం జరగని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆనంద్ కమార్‌కు నియామకం పత్రం అందజేస్తున్న వర్మరాజు

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాంగ్రెస్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వంకర ఆనందకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ జిల్లా అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు చేతుల మీదుగా నియామక పత్రం స్వీకరించారు.. అలాగే సంయుక్త కార్యదర్శిగా కొండపల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్, శ్రీనివాసరావు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వర్మ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఇచ్చిన ఈ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు కెవి.సూర్యనారాయణ, సవరవిల్లి రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్లు మధుసూదనరావు, కస్తూరి వెంకట రావు, భుకారి మహమ్మ పాల్గొన్నారు.

ఆర్‌టిసికి కొత్తగా 1400 బస్సులు రాక

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో ఆర్‌టిసికి 1400 కొత్త బస్సులు వచ్చాయని, త్వరలో మరికొన్ని ఎలక్ట్రికల్ బస్సులతో పాటు డీజిల్ బస్సులు కూడా వస్తాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విశాఖలోని ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో గురువారం సాయంత్రం సిసి కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నానికి కేటాయించిన 100 ఎలక్ట్రికల్ బస్సులలో 50 బస్సులు సింహపురి కాలనీ డిపోలోనూ, 50 బస్సులు గాజువాక డిపోలోనూ ఏర్పాటుచేసి ప్రయాణికుల అవసరాలు తీర్చవచ్చన్నారు. విశాఖపట్నం జిల్లాలో మరికొన్ని బస్సులు పెంచి ప్రయాణికుల అవసరాలు తీర్చే విధంగా చర్యలు తీసుకోనున్నామన్నారు. ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ విశాఖ జిల్లాకు 60 బస్సుల వరకు గతంలో తిప్పిన రూట్లలో, ముఖ్యంగా 900, 14, 28, 288 మొదలగు రూట్లలో కొత్తగా వచ్చిన

మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఎలక్ట్రికల్ బస్సులు నడిపి ప్రయాణికుల అవసరాలు తీరుస్తామన్నారు. 1,25,000 మంది విద్యార్థులకు స్టూడెంట్ బస్సు పాసులను ఈ సంవత్సరం జారీ చేస్తున్నామన్నారు.

కార్యక్రమంలో విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెఎస్.బ్రహ్మానంద రెడ్డి, విశాఖపట్నం డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎం.సుధాబిందు, ద్వారకా బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పిబిఎంకె.రాజు, పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, విజిలెన్సు, సెక్యూరిటీ ఆఫీసర్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

సంగీత పరికరాలపై రాయితీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 21న ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగీత పరికరాలపై అమెజాన్ డాట్ ఇన్ ద్వారా ప్రత్యేక రాయితీలు అందిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి తక్షణ తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంగీత వాయిద్యాల ఆన్లైన్ పోర్టల్‌ను విడుదల చేశారు. ప్రసిద్ధి చెందిన బ్రాండ్స్ బోట్, జెబిఎల్, నాయిస్, తదితర కంపెనీల హెడ్ ఫోన్లు, స్పీకర్లు, సౌండ్ బార్స్, మ్యూజికల్ వాయిద్యాలు సహా విస్తత శ్రేణి ఉత్పత్తులపై కస్టమర్లు 75 శాతం తగ్గింపును పొందవచ్చునన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ 55వ పుట్టినరోజు వేడుకలు గురువారం జగదాంబ జంక్షన్ సమీపంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మ రాజు (హసిని వర్మ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా కార్యకర్తలు, పార్టీ నేతలు, మహిళల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రజా సమస్యలపై రానున్న కాలంలో ఉద్యమించనున్నామని వర్మరాజు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్యా కృషి చేయాలన్నారు. రాహుల్ మార్గ దర్శకత్వంలో నడుస్తామని తెలిపారు.

అమ్మకపు దస్తావేజు పోయినది

నేను ఆళ్ళ శైలజ, D/o. ఆళ్ళ లక్ష్మణరావు, నివాసం ప్లాట్ నెం. 104, సాయిస్రవంతి ఎలిగెన్స్, తాటిచెట్లపాలెం, విశాఖపట్నం. మా నాన్నగారు తే: 09-06-2025దీన అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డు నుండి నడుచుకొని 80 ఫీట్ రోడ్డు మీదుగా తాటిచెట్లపాలెం ఇంటికి వచ్చుచున్నప్పుడు మాదేటి గార్డెన్స్ కళ్యాణమండపం దరి దస్తావేజులు చూసుకొనగా 1598/2008 ఒరిజినల్ రిజిష్టీ అమ్మకపు దస్తావేజు పోయినట్లు గుర్తించారు. కావున ఎవరికైనా దస్తావేజు దొరికిన యెడల పైన తెలిపిన చిరునామాకు , ఈ క్రింది నెంబరుకి తెలియజేయగలరు.

సెల్ నెం. 9885489500

IN THE HONOUJRABLE COURT OF THE 13TH ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE, AT GAJUWAKA
O.S.No.30 OF 2022

Between:
1. Sri Lankey Bhanu Murthy.
2. Sri Lankey Chandra Mohan.
..Plaintiffs.

And:
1. Smt. Lankey Vijayalakshmi
2. Sri Lankey Chandra Sekhar
3. Smt Lankey Rajeswari
... Defendants

SUMMONS TO
DEFENDANT NO.2:
Sri Lankey Chandra Sekhar,
S/o. Late Lankey Pridviraj, Resident of D.No.3-2-286, Kanaka Durga Temple, Bhavani Nagar, Pedagantyada, Visakhapatnam.
DEFENDANT NO.3:
Smt Lankey Rajeswari,
D/o. Late Lankey Pridviraj, resident of D.No.3-2-286, Kanaka Durga Temple, Bhavani Nagar, Pedagantyada, Visakhapatnam.

Please take notice that the above named plaintiffs have instituted the above said suit against the defendants 1 to 3 for partition of the plaint schedule property into three equal shares by meets and bounds by converting joint possession into separate possession and deliver two such shares to these plaintiffs and remaining share to the defendants for the cost of the suit and such other reliefs and the same posted to **27-06-2025.** The above said Honourable Court ordered the defendants nos.2 and 3 to appear personally or through an advocate before the Honourable Court on **27-06-2025 at 10-30 A.M.,** and failing which the matter will be heard and determined in your absence exparte as per law.
(By Order of the Honourable Court)
SRI B.MURALI KRISHNA RAJU
SMT. K. SATYA VANI
SRI B.DEVA KIRAN RAJU
Advocates, Gajuwaka
Mobile No: 9393260078

IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KAKINADA
O.S.NO.1214/2021

Between:
M/s RAK Ceramics India Pvt Ltd
PB No : 11, ADB Road,
IDA Peddapuram,
SAMALKOT – 533440.
... Plaintiff

And:
M/s Jayathi Enterprises,
9-74-3,Dronamraju Nagar,
Opp. Mahilapragathi Mendram.
PENDURTHI, Visakhapatnam – 530047
... Defendant

పై సంఖ్య O.S.No.1214/2021 దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీకోర్టు వారు ద్వారాను, పోస్టల్ ద్వారాను, ఎన్నిసార్లు దావాసమన్లు పంపిన తీసుకొనక ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టు వారు మీ హాజరై నిమిత్తం **తేదీ: 08-07-2025 సం॥రంకి** వాయిదా వేసినారు. కావునా ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** స్వయంగా గానీ, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారు ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎం. జవహర్‌అలీ,
అడ్వకేట్, డో.నెం. 25-6-11
గంజావారివీధి, కాకినాడ.
సెల్: 9848307906

IN THE HON'BLE COURT OF THE II ADDL.CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
I.A.996/2024 & I.A.997/2024 in I.A.1454/2023 in O.S.805/2001

Between:
Sri Kandregula Venkata Ramana
...Petitioner/2nd Plaintiff

And:
Smt. Surisetty Nookaraju & 7 others
...Respondents/Defendants

NOTICE

To,
R-3: Budda Srinu, W/o. Jagga Rao, Hindu, aged 37 years, R/at D.No.44-38-19, Srinivasa Nagar, Akkayyapalem, Visakhapatnam.
R-4: Chandram Mani, W/o. Babjee, Hindu, aged 35 years, R/at D.No.45-50-18, Abid Nagar, Akkayyapalem, Visakhapatnam.
R-5: Yellapu Manga Lakshmi, W/o. Nooka Appa Rao, Hindu, aged 31 years, R/at D.No.45-46-25, Srinivasa Nagar, Akkayyapalem, Visakhapatnam.
R-6: Sarasa Vijaya, W/o. Naidu, Hindu, aged 28 years, Rest-do-

Please take notice that the above named plaintiff filed the above I.A.996/2024 and I.A.997/2024 to restore I.A.1454/2023 by condoning the delay and in the said IA's and the above matter stands posted to **04-07-2025** for your appearance. Therefore, all of you have to attend either in person or through your counsel before the Hon'ble Court on **04-07-2025** at **10:30 A.M.** in the above stated Hon'ble Court, failing which the matter will be decided in your absence.
(As per the Orders of the Hon'ble Court)
V.S. PAVAN, Advocate
Visakhapatnam. **Cell: 9848119594**

మహారాజశ్రీ నర్సీపట్నం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జీ వారి కోర్టులో
O.S. 62/2021

రుత్తల శ్రీనివాసరావు వగైరా . . .వాదులు
అండ్:
పెదపాత్రుని సత్యనారాయణ వగైరాలు
. . . ప్రతివాదులు

కోర్టు సమన్

టు: (ప్రతివాది-1)
పెదపాత్రుని సత్యనారాయణ
తండ్రి లేటు రాములు గుమ్మిడిగొండ
గ్రామం నాతవరం మండలం

పై నెంబర్ దావా నందు శ్రీ కోర్టు వారి మీపై జారీ చేసిన సమన్లు మీపై అమలుకు నోచుకోనందున ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు దావా గ్రంథం **తేదీ 30-06-2025 నాడు 10.30 గంటలకు** మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా ఆయువున్నదనిన్నీ. కావున మీరు స్వయముగా గానీ అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయ్యు మీ యొక్క వాదన ఉన్న యెడల దాఖలు చేయవలసి వున్నదని లేని యెడల. లభ్యంగా ఉన్న రికార్డు ద్వారా తీర్మానం జరుగునని తెలియజేయడం అయినది.

కోర్టు ఆజ్ఞ మేరకు
శ్రీ ఐ.వీ.బీ. రామచంద్రరావు
శ్రీమతి ఎం.గాయత్రి
శ్రీమతి ఐ. మృదుల
అడ్వొకేట్స్, నర్సీపట్నం

నర్సీపట్నం
19-06-2025

రైతు బజారులో టమోటా అమ్మకాల జోరు

రైతు బజారులో టమోటా కోసం ఎగబడుతున్న జనం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక రైతు బజారులో గురువారం టమోటా అమ్మకాలు జోరందుకున్నాయి. రైతు బజారులో కిలో టమోటా రూ.23 పలకడంతో జనాలు ఎగబడ్డారు. క్యూ లైన్ పాటించక పోవడంతో మహిళలు ఒకింత ఇబ్బంది పడ్డారు. 200 కిలోల టమోటా ఒకే దుకాణం వద్ద అమ్మడంతో కొనుగోలుదారులతో దుకాణం వద్ద రద్దీ ఏర్పడింది. ఉదయం 6.30 గంటల నుంచి ప్రారంభమైన టమోటా విక్రయాలు రూ.9.30 గంటలకే పూర్తయ్యాయి. ఒక్కొక్కరూ 6 కిలోల పైబడి టమోటా కొని తీసుకెళ్లడం కనిపించింది. ఒక్కొక్కరికి కిలో, లేదా రెండు కిలోలు ఇలా పరిమితంగా అమ్మకాలు జరిపేలా మార్కెట్ కమిటీ అధికారులు చర్యలు తీసుకుని ఉంటే రైతు బజారుకు వచ్చేవారందరికీ టమోటా చౌక ధరకు లభించేదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. టమోటా లభించక కొందరు నిరాశతో ఇంటికి తిరుగు ముఖం పట్టారు.

ప్రయివేటు మార్కెట్‌లో కిలో రూ.40

టమోటా ధర స్థానిక ప్రయివేటు మార్కెట్‌లో కిలో రూ.30 నుంచి రూ.40 ధర పలికింది. రైతు బజారులో కిలో కేవలం రూ.23కే లభించాయి. దీంతో ఎక్కువ మంది రైతు బజారుకు వెళ్లేందుకు ఆశక్తి చూపారు. రైతు బజారులో అవసరం మేరకు టమోటా అమ్మకాలు లేకపోవడంతో తప్పని సరి పరిస్థితిలో కొందరు

నేరాలు ఘోరాలు

రెండు ఆలయాల్లో హుండీల చోరీ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మల గ్రామంలోని శివాలయం, సంతోషి మాత ఆలయాల్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రెండు ఆలయాల్లో హుండీలు పగలుకొట్టి అందులో సుమారు రూ. 15వేల వరకు నగదును ఎత్తుకుపోయారు. దీనిపై గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వచ్చి సిసి టీవీ పుటేజ్‌ను పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా చోరీ జరిగిన ఆలయాలను జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ గాయపడ్డాడు. ఎలమంచిలి నుంచి తుని వైపు వెళతున్న వ్యాన్ నక్కపల్లి వచ్చేసరికి ముందున వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ వడ్డేపల్లి ప్రవీణ్ స్వల్పంగా గాయపడగా, నక్కపల్లి సిహెచ్‌సిలోచికిత్సను అందించారు. ప్రమాదంలో వ్యాన్ ముందుభాగం దెబ్బతింది. దెబ్బతిన్న వ్యాన్ ను బయటకు తీసి, పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

తాగునీటికి అవే అవస్థలు..

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు తాగునీటి అవస్థలు తప్పడంలేదు. పాఠశాలలో మోటారు పనిచేయక పోవడంతో మూడు రోజులుగా తాగునీటికి అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు జివిఎంసి అధికారులు స్పందిస్తూ మూడు రోజుల పాటు ట్యాంకర్ ద్వారా తాగు నీరు సరఫరా చేశారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో, స్టీల్ క్యాన్లలో తాగు నీటిని నిల్వ చేసుకుని పొదుపుగా వాడారు. ఇక్కడి పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 510 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంతమందికి తాగు నీరు అందించడం ఒకింత కష్టమైన పనే. ట్యాంకర్ ద్వారా తాగు నీరు సరఫరా చేయాలని గురువారం కూడా ఉపాధ్యాయులు కోరగా, యోగాంధ్ర కార్యక్రమానికి తాగు నీరు సరఫరా చేయాల్సి ఉన్నందున ప్రస్తుతానికి సాధ్యపడదని జివిఎంసి అధికారులు తేల్చి చెప్పారని ఉపాధ్యాయులు తెలిపారు. చేసేది లేక ఉన్న కొద్ది నీటితోనే తాగు నీటి అవసరాలు తీర్చుకోవాల్సి వచ్చిందని విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపారు.

బిసి సంఘం విశాఖ జిల్లా మహిళా అధ్యక్షులుగా నాగమణి

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ బిసి సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా మహిళా అధ్యక్షులుగా నాగోతి నాగమణిని నియమిస్తూ జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌ఛార్జి వై.నూకణమ్మ గురువారం కేంద్ర కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ బిసి కుటుంబ సభ్యులు అభ్యున్నతికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నక్కెల్ల నరసింగరావు, యాదవ రాష్ట్ర కమిటీ పెద్దలు కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి పిళ్లా కన్నన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి -ఆనందపురం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడిలోవలోని శ్రీ సరస్వతి విద్యా విహార్, విజ్ఞాన విహార్ పాఠశాలల విద్యార్థులకు యోగాపై అవగాహనకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. రెండు పాఠశాలల నుంచి ఎంపికైన 100 మంది విద్యార్థులు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు గీసిన చిత్రాలు యోగా, ధ్యానం వల్ల ఆరోగ్యం, సమాజం మెరుగవుతుందన్న సందేశాన్ని అందించాయి. విజేతలకు యోగా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. యోగాను ప్రతిఒక్కరూ తమ నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

నాణ్యమైన భోజనం పంపిణీ

నాణ్యతతో కూడిన అన్నం, సాంబారు, గుడ్డు ఇగురు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -తగరపువలస : నాణ్యతా ప్రమాణాలతో కూడిన బియ్యంతో మధ్యాహ్న భోజనం, సాంబారు, గుడ్డు ఇగురు గురువారం ప్రయివేటు ఏజెన్సీ ద్వారా పాఠశాలలకు పంపిణీ చేశారు. 'భోజన నాణ్యత ఇలా.. విద్యార్థుల ఆరోగ్యం ఎలా.?' శీర్షికన గురువారం ప్రజాశక్తిలో కథనం ప్రచురితం కావడంతో మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలలకు సరఫరా చేసే ప్రయివేట్ ఏజెన్సీ పర్యవేక్షకులు, ఉపాధ్యాయుల సమక్షంలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అన్నంతో పాటు సాంబారు, గుడ్డు ఇగురు నాణ్యతగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రోజూ భోజనం ఇదే నాణ్యత తో పంపించాలని పలువురు విద్యార్థులు కోరారు. ఉపాధ్యాయులు, ప్రయివేటు ఏజెన్సీ పర్యవేక్షకులు దగ్గరుండి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో భోజనం వడ్డించారు.

25 కిలోల చొప్పున అవసరమైన ఫైన్ రైస్ బియ్యం బస్తాలు ప్రభుత్వమే నేరుగా ప్రయివేటు ఏజెన్సీ కి పంపిస్తున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి -పద్మనాభం : ప్రకృతి వ్యవసాయ విధానం వల్ల అధిక దిగుబడులు సాధించి వ్యవసాయంలో మంచి ఫలితాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి ప్రకాష్ తెలిపారు. మండలంలోని రెడ్డిపల్లిలో అల్లూరి నరసింహరాజుకు చెందిన గాయత్రి దేవి ప్రకృతి వనంలోని 50 ఎకరాల పామ్ ఆయిల్ తోటలో నవధాన్యాల సాగును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ, 'రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించి అధిక దిగుబడులను సాధించడంతోపాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులకు దోహదపడాలి' అని సూచించారు. ముఖ్యంగా మెట్టు ప్రాంతాల్లో నవధాన్యాల సాగును ప్రోత్సహించాల్సిన అవసరముందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం వల్ల నేల నాణ్యత మెరుగుపడడంతో పాటు జల నిక్షేపాలు కూడా పెరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా రైతులు తాము అనుసరిస్తున్న ప్రకృతి పద్ధతులు, వాటి ద్వారా పొందుతున్న లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎయుకు బ్రెస్ట్ కేన్సర్ ఔషధంపై పేటెంట్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ బి.కిషోర్‌బాబు, వారి పరిశోధనా బృందం (అప్పారావు, స్వర్ణలత, వీర్రాజు, గోపి, ఫణి) బ్రెస్ట్ కేన్సర్ చికిత్సకు అభివృద్ధి చేసిన నూతన నాఫ్తాలిమైడ్ డెరివేటివ్ సమ్మేళనానికి భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం 20 సంవత్సరాల కాలానికి పేటెంట్ మంజూరు చేసింది. ఈ సమ్మేళనం నిర్దిష్టమైన బ్రెస్ట్ కేన్సర్ కణాలపై మెరుగైన ప్రభావాన్ని చూపడం, తక్కువ దుష్ప్రభావాలు కలిగి ఉండటం, డ్రగ్-రెసిస్టెంట్ కణాలను లక్ష్యంగా చేసుకునే ప్రత్యేకమైన పని విధానాన్ని కలిగి ఉండటం వంటి అనేక ప్రయోజనాలను కలిగి ఉంది. ఈ సందర్భంగా కిషోర్‌బాబు బృందాన్ని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జిపి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇఎన్.ధనుంజయరావు అభినందించారు. ఈ ప్రయోగాత్మక విజయం యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకురానుందని వారు పేర్కొన్నారు.

పేటెంట్‌ను చూపుతున్న వీసీ రాజశేఖర్ తదితరులు

కుర్చీలు అందిస్తున్న లక్ష్మినాయుడు, సుమంత్‌నాయుడు తదితరులు

కెజిబివి పాఠశాలకు కుర్చీల వితరణ

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలో ఉన్న కెజిబివి పాఠశాలకు పద్మనాభం ఎంపిటిసి సభ్యులు కంటుబోతు లక్ష్మినాయుడు, భీమిలి నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కంటుబోతు సుమంత్‌నాయుడు సొంత నిధులతో 20 కుర్చీలను అప్పగించారు. కుర్చీల సమస్యను ప్రధానోపాధ్యాయులు చెప్పిన వెంటనే స్పందించి వారు అందించారు.

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సిరి తదితరులు

ఘనంగా సిరి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆనందపురం : భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె సిరి సహస్ర (సిరమ్మ) జన్మదిన వేడుకలు ఆనందపురం మండలంలోని బంటుపల్లి వారి కల్లాల రోడ్డు శుభశ్రీ ఫంక్షన్ హాల్‌లో వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గ వైసిపి నాయకుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సిరమ్మ మాట్లాడుతూ తన తండ్రి ఆశయాల మార్గంలోనే నడుస్తానని చెప్పారు. సామాజిక సేవే తన లక్ష్యమన్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం మండల వైసిపి అధ్యక్షుడు బంక సత్యం, జెడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, మజ్జి వెంకటరావు, గండ్రేటి శ్రీనివాసరావు, పాండ్రంకి శ్రీను, రౌతు వెంకట్రావు, పాండ్రంకి అప్పారావు, గంగరాజు, లంక రాంబాబు, పద్మనాభం ఎంపిపి వాసురాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం వైసిపి కార్యాలయంలో సిరి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణరావు ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి గిరిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంబశివరావుకు ఐసిఎస్ఎస్ఆర్ ఫెలోషిప్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎన్.సాంబశివరావు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్‌లో సీనియర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఫర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సభ్యులు ఘనంగా సత్కరించారు.



కాంగ్రెస్ నాయకులను సత్కరిస్తున్న విన్నకోట రాము

కాంగ్రెస్ నాయకులకు సత్కారం

ప్రజాశక్తి- పెందుర్తి : అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీలో నూతనంగా నియమితులైన పలువురు నాయకులను జిల్లా కాంగ్రెస్ పార్టీ అసంఘటిత కార్మికుల చైర్మన్ విన్నకోట రాము గురువారం 97వ వార్డు పరిధి ఉడా కాలనీలోని ఆయన నివాసంలో గురువారం సత్కరించారు. మాడుగుల అసెంబ్లీ కో-ఆర్డినేటర్ వడాల కొండలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు కాళ్ల వెంకట సత్యనారాయణ (ఏడుకొండలు), ఆర్ఆర్.నాయుడు, జిల్లా ఒబిసి చైర్మన్ బొంతు రమణ, పెందుర్తి మండల అధ్యక్షులు ముక్క రామనాయుడు, పరవాడ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, సబ్బవరం మండలం అధ్యక్షులు బైలపూడి రాంబాబును సత్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ నెల 21న రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు షర్మిల విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిన భానుమూర్తి యాదవ్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బి.బాల మురళి, ఒబిసి సెల్ మాడుగుల నియోజకవర్గం చైర్మన్ డి.గౌరీనాయుడు, ఎం.వెంకటరావు, కెవి.ప్రసాదరావు పాల్గొన్నారు.

దివాకర్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి- సీతమ్మధార : గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ పాత్రికేయుడు దివాకర్‌ను గురువారం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ, దివాకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

లివర్ జాండిస్ సమస్యతో రెండు నెలలుగా బాధ పడుతున్న పైలా దివాకర్‌ను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులోని దివాకర్ నివాసానికి వెళ్లిన అమర్‌నాథ్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలకు వైసిపి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు, వార్డు అధ్యక్షులు పైడి రమణ, దుప్పలపూడి శ్రీనివాస్, బాద శ్రీను, చందన సాయి ఉన్నారు.

చిన్నారుల భవితకు అంగన్‌వాడీ బాటలు

ప్రజాశక్తి-సీతమ్మధార : చిన్నారుల ఉజ్వల భవితకు అంగన్‌వాడీ విద్య బాటలు వేస్తుందని అర్బన్ సిడిపిఒ నీలిమ అన్నారు. జివిఎంసి 53వ వార్డు పరిధి ఆంధ్రకేసరినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సిడిపిఒ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆట పాటలతో కూడిన విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం ఉంటుందన్న విషయాన్ని తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వార్డు మాజీ కార్పొరేటర్ పోలమర శెట్టి నర్సకుమారి చిన్నారులకు బహుమతులు అందజేశారు. నాలుగేళ్ల నిండి ప్రీ స్కూల్ పూర్తయిన పిల్లలందరికీ పట్టాలు అందజేశారు. కార్యక్రమాన్ని సెక్టార్ సూపర్‌వైజర్ జెఎన్‌టి.జ్యోతి పర్యవేక్షించారు. కార్యక్రమంలో మహిళ సంరక్షణ కార్యదర్శులు భవానీ, స్వప్న అంగన్‌వాడీ టీచర్లు, పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

యాదవుల ఐక్యతకు కృషి

ప్రజాశక్తి- గాజువాక : యాదవుల ఐక్యత కోసం కృషి చేద్దామని డిసిసిబి చైర్మన్ కోన తాతారావు అన్నారు. బిహెచ్ఇఎల్ యాదవ సంఘం సభ్యులు గురువారం కోన తాతారావును కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ, అందరమూ కలిసికట్టుగా పనిచేసుకుంటూ ముందుకు పోదామని పిలుపునిచ్చారు. బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేయాలని నేతలు ఆకాంక్షించారు. తాతారావును కలిసిన వారిలో యాదవ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు అల్లి అప్పలనారాయణ, బిహెచ్ఇఎల్ యాదవ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్.అప్పలరాజు, అల్లు అప్పారావు, జి.నరసింగరావు, జి.సుబ్రహ్మణ్యం, వెంకట్రావు, బాలు, ఓకే రాజు, జి.నాగేశ్వరరావు తదితరులున్నారు.

బస్ షెల్టర్ లేక ఇబ్బందులు

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : పారిశ్రామిక ప్రాంతమైన గాజువాక ప్రధాన జంక్షన్‌లో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్ షెల్టర్ ఏర్పాటు సమస్య చిన్నదైనప్పటికీ ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చంటిపాపలతో తల్లులు, వృద్ధులు బస్‌స్టాప్‌ల వద్ద గంటల తరబడి వేచి ఉండలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గతంలో శ్రీనగర్ నాలుగు రోడ్లు జంక్షన్ దగ్గర శ్రీనగర్ నుంచి గాజువాక వచ్చే రోడ్డులో పెద్ద ఎత్తున బస్ షెల్టర్ ఉండేది. దాని వెనుక స్థలం ఉన్న వ్యక్తి ఆ షెల్టర్‌ను అక్కడ లేకుండా చేశారు. దీంతో ఆ రోజు నుండి నేటి వరకు షెల్టర్ లేదు. అక్కడికి వచ్చే ప్రయాణికులు స్కూలు పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీనగర్, సుందరయ్య కాలనీ, దిబ్బపాలెం, ఆఫీసర్ కాలనీల ప్రజలు ప్రతిరోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు రాకపోకలు సాగించేందుకు ఈ బస్టాప్‌ను ఆశ్రయిస్తున్నారు. బస్సు రానంతవరకు ఎండ, వర్షాలకు అక్కడ నిలబడేందుకు షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారు బస్టాప్ ఎదురుగా టిఎస్ఆర్ టిబికె జూనియర్ డిగ్రీ పీజీ కళాశాల ఉంది. ఈ కాలేజీ పిల్లలు కూడా షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారు.

శ్రీనగర్‌లో నిలబడిన ప్రయాణికులు

పాత గాజువాకలో షెల్టర్ లేక ఎండలోనే నిలబడిన ప్రయాణికులు

అన్ని ప్రాంతాల ప్రధాన జంక్షన్ అయిన పాత గాజువాకలో ఐదేళ్లుగా బస్ షెల్టర్ లేకుండా బస్సులు నిలుపుదల చేస్తున్నారు. గతంలో పాత గాజువాక నుండి కొత్త గాజువాక వరకు సుధా హోటల్‌కు ఎదురుగా ఒక బస్సు షెల్టర్, మోహిని థియేటర్ ఎదురుగా ఒకటి, బొమ్మనా బ్రదర్స్ ఎదురుగా ఒకటి షెల్టర్లు ఉండేవి. వ్యాపారాలకు అడ్డు వస్తున్నాయని రాజకీయ పలుకుబడిన ఉపయోగించి కొందరు ఆ షెల్టర్లను తొలగింపజేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు ప్రభుత్వ రహదారులను కూడా షాప్ యజమానులు వారి సొంతానికి ఉపయోగిస్తున్నారు. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ జంక్షన్ నుంచి రోజుకు వేలాదిమంది ప్రయాణికులు, స్కూల్ పిల్లలు విశాఖ నగరానికి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం పడితే బస్సు షెల్టర్ లేక తడిచిపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సిజిహెచ్ఎస్ సమస్యలు పరిష్కరించాలి

ప్రధాన మంత్రికి పెన్షనర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిజిహెచ్ఎస్ సమస్యలపైన, 8వ వేతన సంఘం సిఫార్సులను పెన్షనర్లకు అమలుపై ఈ నెల 21వ తేదీన విశాఖపట్నం వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం. చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లు సరిపడినన్ని లేవని, 12 వేలమంది లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు సుమారు 30 వేలమందికి కనీసం 5 వెల్‌నెస్ సెంటర్లు ఉండాలని, కానీ 2 సెంటర్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫీసు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన వాగ్దానం ఇంతవరకు నెరవేరలేదని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పెన్షనర్ల వైద్య సేవలకు ఇదే ప్రధాన ఆధారం అని, తక్షణమే ఎడి ఆఫీసు విశాఖలో ఏర్పాటుచేయాలని, పోలిక్లినిక్, తగినన్ని వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటుచేయాలని కోరారు.

2025 ఏప్రిల్ 28వ తేదీ నుండి ఎన్ఐసి మాడ్యూల్‌ను సి-డిఏసి మాడ్యూల్‌కు మార్పు చేస్తుండడం వల్ల సిజిహెచ్ఎస్‌లో గందరగోళం ఏర్పడిందని పేర్కొన్నారు. వెల్‌నెస్ సెంటర్లలోను, ఎంపేనల్డ్ ఆసుపత్రులలోనూ వైద్య సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని, ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్స్ తగ్గించేశారని, ఆఫ్‌లైన్ అపాయింట్‌మెంట్స్ దొరకక లబ్ధిదారులు వెల్‌నెస్ సెంటర్ల వద్ద తెల్లవారుఝామున 2- 3 గంటల నుండి క్యూ లైన్లలో నిల్చుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వైద్యులు అందుబాటులో లేక రోజూ సుమారు వందమంది తిరిగి వెళ్లిపోతున్నారని తెలిపారు. ఈ వృద్ధాప్యంలో పెన్షనర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అవసరమైతే రెండు మాడ్యూల్స్‌ను కొనసాగించి ఉపశమనం కల్పించాలని కోరారు. కేంద్ర ఆర్థిక బిల్లులో భాగంగా ప్రవేశపెట్టిన పెన్షన్ రూల్స్ ఎమెండ్‌మెంట్స్ చట్టం పలు అనుమానాలకు, భయాలకు తావిస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లందరకూ 8వ వేతన సంఘ సిఫార్సులు అమలుచేయాలని డిమాండ్ చేశారు.

26 నుంచి రథయాత్ర ఉత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : టౌన్ కొత్త రోడ్డులో ఈ నెల 26 నుంచి జులై 7వ తేదీ వరకు నిర్వహించే జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాల పోస్టర్‌ను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ మహోత్సవాలను అత్యంత వైభవంగా జరిగేందుకు తాము కూడా సహకరిస్తామని తెలిపారు. రథయాత్రలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆలయ కార్యనిర్వహణాధికారికి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్ రెడ్డి, ఆలయ అర్చకులు జగన్నాథాచార్యులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీ దేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన పేద మహిళలకు ఉచితంగా కుట్టులో శిక్షణను గురువారం ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పేద మహిళలు వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుట్టు శిక్షణా కేంద్రం ఇన్‌ఛార్జి పావని తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

పోలీసుల చర్యపై నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార : విజయవాడ బందర్ రోడ్డు సమీపంలోని శ్రీ చైతన్య క్యాంపస్‌లో విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా పుస్తకాలు, యూనిఫామ్ ఎంఆర్‌పి లేకుండా చేస్తున్న విక్రయాలపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపిన ఎఐఎస్ఎఫ్ నాయకులపై పోలీసుల చర్యను వ్యతిరేకిస్తూ ఆశీలుమెట్టలోని శ్రీ చైతన్య స్కూల్ సుధా క్యాంపస్ వద్ద గురువారం యూనియన్ ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ, పుస్తకాలు, యూనిఫాం పేరుతో తల్లిదండ్రుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న శ్రీచైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్ఐఒను ఎఐఎస్ఎఫ్ నాయకులు కోరారని, ఆర్ఐఒ కళాశాలకు వచ్చేలోపే క్యాంపస్‌ను ఖాళీ చేసి వెళ్లాలని మాచవరం పోలీసులు సంఘం నాయకులపై బూటు కాళ్లతో తన్ని బయటకు నెట్టేశారని తెలిపారు. విద్యార్థి సంఘ నాయకులను స్టేషన్‌కు తరలించి అక్రమ కేసులు పెట్టినట్లు ఆరోపించారు. ఈ వైఖరిని ఎఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థ ఫీజుల దోపిడీకి పోలీసులు మద్దతు ప్రకటించడం దేనికి నిదర్శనం అని నిలదీశారు. పోలీసుల వైఖరిని మంత్రి నారా.లోకేష్, హోంమంత్రి అనిత ఖండించి ఫీజుల దోపిడీ చేస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ఎఐఎస్ఎఫ్ పోరాడుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.శేఖర్, సహాయ కార్యదర్శులు మౌనిక, హేమానంద్, సభ్యులు అభి, గణేష్, సూర్య, మధు, అశోక్, వినయ్, ఆకాష్, పాల్గొన్నారు.

సంక్షేమానికి నిబంధనాలు

◆ పథకాలకు దూరమవుతున్న పేదలు

◆ పలువురికి అందని తల్లికి వందనం

ప్రజాశక్తి-వడ్డాది

రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న పలు నిబంధనలతో పేద, మధ్య తరగతి ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం తాజాగా అమలు చేసిన తల్లికి వందనం పథకం అనేక మంది పేదలకు అందలేదు. ఆర్థిక భారం తగ్గించుకునేందుకు పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త కొత్త నిబంధనలను తెరమీదకు తీసుకువచ్చింది.

ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం రూ.15వేలు చొప్పున అమలు చేస్తామని గత ఎన్నికల సమయంలో కూటమి పార్టీల నేతలు హామీల వర్షం గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఏడాది పూర్తయిన తర్వాత అమలు చేసిన తల్లికి వందనం పథకంలో రూ.2వేలు తగ్గించగా, అమల్లోనూ ఎన్నో షరతులు విధించారు. ప్రతి సచివాలయంలో ప్రస్తుతం ఇదే హాట్ టాపిక్‌గా మారింది. ఈ పథకం వర్తించని వారితో సచివాలయాలు రద్దీగా కనిపిస్తున్నాయి. ఆ ఏడాదిలో ఏ నెలలోనైనా 300 యూనిట్లుకు పైబడి కరెంటు బిల్లు వచ్చినా, 3 ఎకరాలు మాగాణి, 10 ఎకరాలు మెట్టు పొలం, ఫోర్ వీలర్ వాహనం వున్నా, గతంలో ఎపుడైనా ఇన్‌కమ్ టాక్స్ కట్టినా, వెయ్యి చదరపు అడుగులకు పైబడి విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకున్నా ఈ పథకం అమలు చేయలేదు. అలాగే గ్రామీణ ప్రాంతంలో అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్న అంగన్వాడీ వర్కర్లకు, ఆశా కార్యకర్తలకు, పారిశుధ్య కార్మికులకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈ పథకం వర్తింపజేయలేదు. వీరందరికీ గత వైసిపి ప్రభుత్వంలో అమ్మకు ఒడి పథకం వర్తింపజేయగా, కూటమి ప్రభుత్వంలో మాత్రం తమకు తల్లికి వందనం పథకం అమలు చేయడం లేదని సంబంధిత మహిళలు వాపోతున్నారు. అలాగే ఈ ఏడాది టెన్త్, ఇంటర్ సెకండ్ ఇయర్ పాస్ అయిన వారికి కూడా ఈ పథకం అమలు కాలేదు.

పిల్లలందరికీ అమలు కాని తల్లికి వందనం

ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం అమలు చేసినట్లు ప్రభుత్వం చెబుతుండగా, బుచ్చయ్యపేట మండలంలో అలా అమలు కాలేదు. వడ్డాది గ్రామంలో శాంతి అనే మహిళ తన ఇద్దరు పిల్లలలో ఒక్కరికే తల్లికి వందనం పడిందని వాపోయింది. ఎల్‌బిపి.అగ్రహారంలో మీనా కుమారి అనే మహిళకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఇద్దరికీ తల్లికి వందనం పడలేదని ఆవేదన చెందారు. అర్హతలు ఉండి కూడా తల్లికి వందనం పడలేదని, సచివాలయానికి వెళితే బ్యాంకుకు వెళ్లాలని చెబుతున్నారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. 300 యూనిట్లు కరెంటు వినియోగం లేకపోయినా 5వ తరగతి చదివిన తమ కుమారుడికి తల్లికి వందనం అమలు చేయలేదని వడ్డాదికి చెందిన శ్యామ్ అనే వ్యక్తి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక కారణాలు చూపించి తల్లికి వందనం పథకానికి కొంతమందిని దూరం చేస్తుందని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం నిబంధనలపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అమ్మఒడి పడింది.. తల్లి వందనం దక్కలేదు

కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. గత ప్రభుత్వంలో మూడు సార్లు అమ్మఒడి పథకం వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇస్తున్న తల్లికి వందనం పడలేదు. కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు మొండి చేయి చూపించింది.

- అప్పలనర్స, తురకల పూడి

స్కీమ్ వర్కర్లకు తల్లికి వందనం ఇవ్వకపోవడం సరికాదు

గత ప్రభుత్వంలో 42 రోజులు ధర్నాలు చేసినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి కూటమి నేతలు అంగన్వాడీ కార్యకర్తలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలో ఉండి అంగన్వాడీలకు తల్లికి వందనం అమలు చేయకపోవడం సిగ్గుచేటు. రూ.12000 జీతం తీసుకున్న వారు అనర్హులు ఎలా అవుతారు? ఆ జిఒ ఇచ్చిన వారు నిద్ర మత్తు నుండి లేవాలి. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తల్లికి వందనం అమలు చేయాలి.

- పి.వరలక్ష్మి, సిఐటియు బుచ్చయ్యపేట మండల కార్యదర్శి.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం

అందరికీ తల్లికి వందనం నగదు వేయాలి : ఐద్వా

ప్రజాశక్తి-పరవాడ

బడికి వెళ్లే పిల్లల తల్లులందరి ఖాతాల్లో తల్లికి వందనం నగదు జమ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఇప్పుడు కొత్త మెలికతో ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కరెంట్ బిల్లు 300 యూనిట్లు వస్తే తల్లికి వందనం రాదని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. తల్లికి వందనం రానివారు వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. కరెంట్ బిల్లుకు తల్లికి వందనం పథకానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. కూటమి ప్రభుత్వం జీవో ఇచ్చినప్పుడు అటువంటి ఆప్షన్లు ఏవీ పెట్టలేదని, ఇప్పుడు కరెంట్ బిల్లుకు లింక్ ఎందుకు పెడుతున్నారని ఆమె ప్రశ్నించారు. ప్రజల్ని ప్రభుత్వం మోసం చేయడం తగదన్నారు. తక్షణమే తల్లికి వందనం రాలేని వాళ్ళ ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా స్థానిక కమిటీ అధ్యక్షులు బంగారమ్మ, కార్యదర్శి అన్నపూర్ణ, కమిటీ సభ్యులు లీల, సీత, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం చేస్తున్న జూరెడ్డి రాము, టిడిపి నేతలు

ఘనంగా ఎమ్మెల్యే బండారు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జన్మదిన వేడుకలు గురువారం టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు జూరెడ్డి రాము ఆధ్వర్యంలో షిరిడి సాయి ఆలయంలో పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. అంతకుముందు టిడిపి మండల కార్యాలయ ఆవరణలో పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం 30 పడకల ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కె.,కోటపాడు, కింతాడ, ఎ.కోడూరు మాజీ సర్పంచ్‌లు డోకల నరసింహమూర్తి, బండారు నరసింహనాయుడు, లెక్కల మల్లేశ్వరరావు, టిడిపి నాయకులు సబ్బవరపు రామనాయుడు, కన్నూరు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాసరావుకు పరామర్శ

ప్రజాశక్తి-పరవాడ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావును గురువారం పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు అర్జిల్లి అప్పలరాజు పరామర్శించారు. ఇటీవలే శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మరణించగా, గురువారం పెద్దకర్మ, సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలరాజు ఘన నివాళులర్పించారు. అలాగే ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కూండ్రపు కృష్ణంనాయుడు సంతాప సభలో పాల్గొని పల్లా సింహాచలం చిత్రపటానికి పూలుతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. లక్కవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై విత్తన పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. విత్తనాలతో పాటు స్థానిక రైతులకు పవర్ టిల్లరు, స్ప్రేయర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలు రాయితీపై రైతులకు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. పంట విధానంలో వ్యవసాయ శాఖ సూచనలు మేరకు రైతులు సాగు చేయాలని ఆయన కోరారు. ప్రతి కేజీ విత్తనానికి పది రూపాయలు చొప్పున లేదా, బస్తాకి రూ.300 చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈ.పావని, ఏఈఓ కిరణ్, లక్ష్మణ్, వీఏఏ మణికుమారి, గవర కార్పరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, టిడిపి మండల అధ్యక్షులు మచ్చిరాజు, లక్కవరం గ్రామ నాయకులు నాగులపల్లి సూర్యనారాయణ, వొబ్బలరెడ్డి శ్రీను, కొప్పు నారాయణరావు, కర్రి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

22న ఎంఆర్‌పిఎస్ మండల సమావేశం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కె.కోటపాడు మండల సమావేశం ఈనెల 22న మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం ప్రచార కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చౌడువాడలో గురువారం ఎంఆర్‌పిఎస్, ఎంఎస్పి, ఎంఈఎఫ్ కార్యకర్తలు సమావేశం జరిగింది. మండలంలోని అన్ని గ్రామాల నుండి మాదిగలందరూ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనకాపల్లి అనిత, రాజు, జీవరత్నం, ఈశ్వరమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న వాహనాలపై చర్యలు

ప్రజాశక్తి-కశింకోట : అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాల నియంత్రణకు కశింకోట సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక దృష్టి సారించారు. బయ్యవరం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో అధిక లోడ్‌తో వెళ్తున్న ఒక లారీని గుర్తించి ఆ లారీని అనకాపల్లి డిటిఓ అప్పగించారు. ఆ వాహనంపై భారీ మొత్తంలో రూ.80వేలు జరిమానా విధించారు. వాహనదారులు చట్టాలకు లోబడి, నిబంధనల మేరకు వాహనాలను నడపాలని సిఐ సూచించారు. అధిక లోడుతో ప్రయాణించడం వల్ల రహదారి ప్రమాదాలు సంభవిస్తాయని తెలిపారు. ఇలాంటి తనిఖీలు రెగ్యులర్‌గానే కొనసాగిస్తామని, ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎంపిడిఒకు ఎమ్మెల్యే రాజు నివాళి

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి మృతదేహానికి చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్.రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తదితరులు గురువారం విశాఖపట్నంలో వారి స్వగృహంలో నివాళులర్పించారు. మండలంలో వివాద రహిత అధికారిగా పేరుందిన విజయలక్ష్మి మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు తమరాన దాసు, వెయ్యి పు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో సిద్ధంగా ఉంచిన బస్సులు

యోగాంధ్రకు వందలాది బస్సులు సిద్ధం

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖపట్నంలో ఈనెల 21న నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం యోగాంధ్ర కార్యక్రమానికి వెళ్లేందుకు వందలాది బస్సులు అనకాపల్లిలో సిద్ధంగా ఉంచారు. రాష్ట్రంలో పలు ఆర్టీసీ డిపోలకు చెందిన వందలాది బస్సులో అనకాపల్లిలో పలు రోడ్లలో పాల్గొనేవారిని తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉంచారు. దీంతో అనకాపల్లి పట్టణంలో బస్సుల సందడి కనిపించింది.

తాత్కాలికంగా గుంతల పూడ్చివేత

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం మెయిన్ రోడ్డులోని కొత్తూరు జంక్షన్‌లో గుంతలను తాత్కాలికంగా పూడ్చే పనులను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు గురువారం చేపట్టారు. మెయిన్ రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాలు రాకపోకలకు తీవ్రత అంతరాయం కలగడంతో రోడ్డు పనులు చేపట్టే వరకు చిన్నచిన్న మరమ్మతులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మచ్చీరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, ఎంపీడీవో ఆంజనేయులు యువోపిఆర్డి మహేష్, ఈవో శ్రీనివాసరావు, సిఐ శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

యోగాంధ్రకు ట్రాఫిక్ మార్గదర్శకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖపట్నం సాగర తీరంలో ఈ నెల 21న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరవుతున్న నేపథ్యంలో జిల్లాలో ట్రాఫిక్‌పై మార్గదర్శకాలను గురువారం జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా వెల్లడించారు. అనకాపల్లి జిల్లాలోని 24 మండలాల నుంచి ప్రజలు విశాఖ, పీఎం పాలెం, ఎన్‌విపి లా కాలేజ్ వద్ద ఏర్పాటు చేసిన 37 కంపార్టుమెంట్లలో బస్సుల ద్వారా చేరుకుంటారు.

ఎస్‌పి తుహిన్ సిన్హా

రూట్-1లో అనకాపల్లి, వి.మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు, చోడవరం, దేవరపల్లి, బుచ్చయ్యపేట, రోలుగుంట, రావికమతం, సబ్బవరం మండలాలకు చెందిన బస్సులు చిన్నయ్యపాలెం జంక్షన్, సబ్బవరం, పెందుర్తి, గండిగుండం, శోంఠ్యాం అండర్ బ్రిడ్జి, అడవివరం, హనుమంతవాక, లా కాలేజ్, ఐటి సెజ్ దారిలో ప్రయాణించాలి.

రూట్-2లో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, కసింకోట, మునగపాక, కోటవురట్ల, నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన బస్సులు జాతీయ రహదారి, తాళ్లపాలెం జంక్షన్, కసింకోట, జలగల మధుం, సబ్బవరం, పెందుర్తి, గండిగుండం, శోంఠ్యాం అండర్ బ్రిడ్జి, అడవివరం, హనుమంతవాక, లా కాలేజ్, ఐటి సెజ్ దారిలో రావాలి.

రూట్-3లో రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల ఇండస్ట్రియల్, విద్యార్థుల బస్సులు లంకెలపాలెం, గాజువాక, ఎన్‌ఎడి, గోపాలపట్నం, సింహాచలం, అడవివరం, హనుమంతవాక, లా కాలేజ్, ఐటి సెజ్ చేరుకోవాలి.

పాయకరావుపేట నుండి విశాఖ దిశగా వెళ్లే భారీ వాహనాలు జూన్ 20 సాయంత్రం 6 గంటల నుంచి నిలిపివేయడం జరుగుతుంది. సాధారణ వాహనాలు, అత్యవసర వాహనాలు పాయకరావుపేట నుండి జాతీయ రహదారి మీదుగా ఆనందపురం వైపు మళ్లించడం జరుగుతుంది. అత్యవసర వాహనాల ప్రయాణానికి ప్రత్యేక వెసులుబాటు కల్పించడం జరిగింది. కంపెనీలకు చెందిన బస్సులు 20వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి నిలిపివేయడం జరుగుతుంది. ట్రాఫిక్ రద్దీ లేకుండా యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది పటిష్టంగా బందోబస్తు నిర్వహించాలని ఎస్‌పి సూచించారు. బస్సులను కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోకి సజావుగా నడిపేందుకు ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు సంబంధించిన 48 బస్సులు కూడా ఈ రూట్లలోనే ప్రయాణించాలని స్పష్టం చేశారు.

జిల్లా పరిధిలో లారీలు నడపరాదు

యోగాంధ్ర కార్యక్రమం నేపథ్యంలో అనకాపల్లి జిల్లాలో ఈ నెల 20, 21 తేదీల్లో భారీ లారీల నడప రాదని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు జారీ చేశారు. అనకాపల్లి జిల్లా పరిధిలో ఉండే లారీ యజమానులందరూ ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున అనకాపల్లి జిల్లా పరిధిలో గానీ, విశాఖపట్నం సిటీ పరిధిలో గాని తమ వాహనాలను నడపరాదని సూచించారు. విశాఖపట్నం సిటీ పరిధిలో 20, 21తేదీలలో ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లా ప్రాంతాలకు వెళ్ళే ప్రజలు ఏదైనా అత్యవసరమైన వ్యవహారాలలో తప్పించి తమ ప్రయాణాన్ని రెండు రోజులూ వాయిదా వేసుకోవాలని కోరారు. బ్రేక్‌డౌన్ అయిన లేదా రిపేర్ కోసం నిలిపిన వాహనాలను రహదారులపై ఉంచరాదని, అలాంటి వాహనాలు ఉంటే తక్షణమే తొలగించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఫార్మా కంపెనీలు, ఇతర పరిశ్రమలలోకి రాకపోకలు సాగించే అన్ని రకాల రవాణా వాహనాల మూమెంట్‌ను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు.

'ప్రజలపై కక్ష సాధిస్తున్న జగన్'

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

2024 ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు పరిమితం చేసినందుకు జనంపై కక్ష తీర్చుకోవడానికి జగన్మోహన్‌రెడ్డి యాత్రలు సాగిస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సత్తెనపల్లిలో నరుకుతామని బహిరంగంగా ప్రకటనలు చేస్తూ, ఫ్లెక్సీలు, నినాదాలు అరుపులు కేకలు వేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ఓడిపోయిన పార్టీ బాధ్యత వహించి ప్రజా సమస్యలపై పోరాటం చేయవలసి ఉండగా, కుల రాజకీయాలు, ప్రాంతీయంగా రెచ్చగొడుతూ తన పార్టీ కార్యకర్తలకు డబ్బులు మద్యం, వాహనాలకు పెట్రోల్ ఇచ్చి తన బలంగా శునకానందం పొందుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ , కుప్పిలి జగన్, మల్ల గణేష్, కాండ్రేగుల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎ పోతురాజు మృతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట, వడ్డాది

బుచ్చయ్యపేట మండలం గంటికొర్లాం రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న పోతురాజు గురువారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నారు. గురువారం తెల్లవారు జామున గంటికొర్లాంలోని తన స్వగృహంలోనే మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. 50 సంవత్సరాల నుండి గంటికొర్లం వీఆర్‌ఏగా విధులు నిర్వహించారు. ఆయన మృతికి గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు సంతాపం తెలిపారు. మండలంలోని విఆర్ఎ అందరూ గంటికొర్లాం చేరుకొని అంత్యక్రియలో పాల్గొని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బంగారు ఆభరణాల అపహరణ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం బీసీ కాలనీకి చెందిన గొర్లి దేవి అనే మహిళ మెడలో నుండి బంగారు ఆభరణాలు, పుస్తెలతాడు లాక్కొని పరారైన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గొర్లివానిపాలెం బీసీ కాలనీలో గొర్లి దేవి మార్చి 12వ తేదీన నడుచుకుంటూ వెళుతుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి స్కూటీపై వచ్చి ఆమె మెడలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలను, నాలుగు తులాల పుస్తెలతాడు, ఒక తులం శతమానాలు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ ఆర్.మల్లికార్జునరావు నేతృత్వంలో విచారణ చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీ పుటేజ్‌లను విశ్లేషించి నిందితుడిని గుర్తించి, బుధవారం ఉదయం 11.15 గంటల సమయంలో కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద వడ్లపూడికి చెందిన బోండా అరుణ్ కుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. విచారణలో అతను నేరాన్ని ఒప్పుకొని, దొంగిలించిన బంగారు ఆభరణాలను ఓ గోల్డ్ లోన్ కంపెనీలో తాకట్టు పెట్టినట్టినట్లు తెలిపాడు. పోలీసులు అక్కడికి వెళ్లి పంచనామా నిర్వహించి పుస్తెలతాడును, నేరానికి ఉపయోగించిన టీవీఎస్ సుజుకి యాక్సెస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో తరలిస్తామన్నారు. ఎఎస్‌ఐ బివై.నాయుడు, హెడ్ కానిస్టేబుల్ సాయి సంతోష్, క్రైమ్ కానిస్టేబుల్ జిఎస్‌ఎస్‌వి.నాయుడు ఈ అరెస్టులో పాల్గొన్నారు.

నిందితుడు అరుణ్ కుమార్‌పై గతంలో ఆనందపురం, సబ్బవరం, ఉయ్యూరు టౌన్ పోలీస్ స్టేషన్లలో మూడు చైన్ స్నాచింగ్ కేసులు, ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో మోటార్ సైకిల్ దొంగతనం కేసు నమోదు కాగా, దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో రౌడిషీట్ కూడా ఓపెన్ చేయబడి ఉంది. ఇతడు బెట్టింగ్, పేకాట వ్యసనాలతో నేరాలకు పాల్పడుతున్నట్లు తెలియవచ్చిందని పోలీసులు తెలిపారు. మహిళలు నడుచుకుంటూ వెళుతున్నప్పుడు పరిసరాలను జాగ్రత్తగా గమనించాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

విద్యుత్ కోతలపై నిలదీత

మాట్లాడుతున్న ఎంపిపి బోకం సూర్యకుమారి

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బోకం సూర్యకుమారి అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు అనవసర విద్యుత్తు కోతలపై అధికారులను నిలదీశారు. గత కొద్దిరోజులుగా మండలంలోని విద్యుత్ కోతలు ఎక్కువ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి అధికారులు స్పందిస్తూ లోవోల్టేజ్ సమస్య వల్ల మండలంలోని విద్యుత్తు సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. రాంపురం నుండి అంతకాపల్లి సబ్ స్టేషన్‌కు లైను రావాల్సి ఉందని, పెద ముషిడివాడ నుండి సబ్బవరం సబ్ స్టేషన్‌కు లైను పనులు జరుగుతున్నాయని చెప్పారు. రిపేర్లు, మరమ్మతులు జరుగుతున్నందున విద్యుత్తు కోతలు విధిస్తున్నామని తెలిపారు.

ఖరీఫ్ సీజన్ రావడంతో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో 50శాతం సబ్సిడీతో విత్తనాలు, మొక్కలు, పనిముట్లు, యంత్రాలు అందిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. పశు సంవర్ధక శాఖ అధికారులు మాట్లాడుతూ పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తామన్నారు. పలు శాఖల అధికారులతో ఎంపీపీ సూర్యకుమారి సమీక్ష నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-1 శరగడం ఝాన్సీ లక్ష్మీరాణి, డిప్యూటీ తహశీల్దారు సిహెచ్.అప్పారావు, ఏవో కె.శివనారాయణ ప్రసాద్, ఈఒపిఆర్‌డి చైతన్య, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

వివిధ కారణాలతో విద్యకు దూరమైన వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎపి సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా నేరుగా 10వ తరగతి, పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు నేరుగా ఇంటర్మీడియట్‌లో చేరడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జులై 30వ తేదీలోగా తగిన రుసుము చెల్లించి, ఆన్లైన్ విధానం ద్వారా గాని, జిల్లాలో ఉన్న ఓపెన్ స్కూల్ సహాయ కేంద్రాల ద్వారా గాని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓపెన్ స్కూల్ 10వ తరగతిలో చేరడానికి ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని, చదవడం, రాయడం వచ్చి ఉండాలని కోరారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, పాఠశాలలో ఏదో ఒక తరగతిలో చదివిన నాటి టీసీ, పుట్టిన తేదీ ధ్రువపత్రం ఉండాలన్నారు. ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్లో చేరేందుకు తగిన రుసుము చెల్లించి, పదవ తరగతి ఉత్తీర్ణులైన మార్కుల జాబితా, టీసీ, ఆధార్ కార్డు, సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు, వికలాంగులు వారి వికలత్వం అర్హత ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలని సూచించారు. రూ.200 అపరాధ రుసుముతో ఆగస్టు 15 తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏపీ ఆన్లైన్, మీ సేవ కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తుల సమర్పించుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి సమాచారం కొరకు జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో 80089 02915 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు ఉషోదయలో జాబ్ మేళా

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ఉషోదయ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ జె.రమణాజీ ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని, డిగ్రీ, ఇంటర్, బిబిఎ, పదో తరగతి చదువుకున్న నిరుద్యోగులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9948746344 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

తీవ్రంగా గాయపడిన ఆవు పెయ్య

కుక్కల దాడిలో మేక మృతి

ఆవు పెయ్యకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్ళపాలెం గ్రామంలో గురువారం కుక్కలు ఒక ఆవు పెయ్య, మేకపైనా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ దాడిలో మేక చనిపోయింది. గ్రామానికి చెందిన పొన్నము గోవిందకు చెందిన ఆవు పెయ్యను తన వ్యవసాయ పాక వద్ద కుక్కలు దాడి చేసి కరిచివేయడంతో దానికి తీవ్ర గాయాలయ్యాయి. పెయ్య నిలబడిలేక చనిపోయే స్థితిలో వుంది. తమను ఆడుకోవాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. అలాగే సోమరాజుకు చెందిన మేకను తీవ్రంగా కరవడంతో అది చనిపోయింది. గ్రామంలో కోళ్లను కూడా కుక్కలు చంపిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు 6 బహుమతులు

ప్రజాశక్తి-అనకాపల్లి

యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని గుంటుపల్లి వద్దనున్న డాన్ బాస్కో స్కూల్‌లో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించిన యోగాంధ్ర రాష్ట్రస్థాయి పోటీల్లో 13 విభాగాల్లో జిల్లాకు 6 బహుమతులు లభించాయి. మూడు ప్రథమ, రెండు ద్వితీయ, ఒక తృతీయ బహుమలు సాధించగా, విజేతలను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, డిఆర్‌ఓ సత్యనారాయణరావు గురువారం అభినందించారు. విజేతలుగా నిలిచిన 19 -35 ఏళ్ల వయసుగల వారి మధ్య జరిగిన పోటీల్లో యోగ స్లోగన్‌లో ద్వితీయ స్థానం సాధించిన అలేఖ్య, యోగ పోస్టర్లో తృతీయ స్థానం, యోగ క్విజ్ పోటీలో 10-18 సంవత్సరాల వయసులో డి ప్రియాంక, యోగా పెయింటింగ్‌లో షితేజ మొదటి బహుమతి, యోగ పోస్టర్లో పి.భవిత ద్వితీయ స్థానం, 35 సంవత్సరాల పైబడిన సింగర్ నైస్డ్ గ్రూప్ ఈవెంట్‌లో మొదటి బహుమతి సాధించినారు. విజేతలకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీష చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

నేడు, రేపు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ.: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ ఆర్‌కె బీచ్ కాళీమాత గుడి వద్ద ప్రధాని మోడీ యోగాంధ్రలో పాల్గొంటున్న నేపథ్యంలో ఈనెల 20, 21వ తేదీల్లో విశాఖ నగర పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ విశాఖపట్నం సిటీ ట్రాఫిక్ పోలీస్ ఉత్తర్వులు జారీ చేశారు

యోగా దినోత్సవ భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమైన పోలీసులు

వివిపి పార్కింగ్

కార్యక్రమానికి హాజరయ్యే వీఐపీలు తమ వాహనాలను సిరిపురం సిఆర్ రెడ్డి సర్కిల్ ఆల్ ఇండియా రేడియో జంక్షన్ మీదుగా ఏపీఐఐసీ గ్రౌండ్‌కు చేరుకోవాలని సూచించారు.

ప్రయాణ మార్గాలు

శ్రీకాకుళం వైపు నుండి వచ్చేవారు శ్రీకాకుళం, రణస్థలం తగరపువలస, చిలకపేట మీదుగా భీమిలి బీచ్ రోడ్డుకు చేరుకోవాలని సూచించారు. విజయనగరం నుండి వచ్చేవారు తగరపువలస వచ్చి బోయపాలెం మీదుగా భీమిలి తిమ్మాపురం బీచ్ రోడ్డుకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అనకాపల్లి జిల్లా నుంచి వచ్చేవారు పెందుర్తి, వేపగుంట, అడవివరం హనుమంతవాక ఎండాడ మీదుగా లా కాలేజ్ రోడ్డుకు చేరుకోవాలని సూచించారు. అల్లూరి జిల్లా మీదుగా వచ్చేవారు వేపగుంట అడివివరం, హనుమంతవాక మీదుగా ఎంపీపీ డబల్ రోడ్డుకు చేరుకొని అక్కడి నుండి విశాఖ కంటి ఆసుపత్రి రోడ్డు ద్వారా మద్దిలపాలెం జంక్షన్ కుచేరుకొని ఏయు ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకోవాలని సూచించారు. విశాఖ నగరంలోని వాహనదారులు హైవే మీదుగా వచ్చి ఆయా ప్రాంతాలలో అప్రోచ్ రోడ్ల మీదుగా చేరుకోవాలని అధికారులు సూచించారు

ట్రాఫిక్ ఆంక్షలు

ఈ నెల 20 ,21 తేదీలలో ఎన్టీఆర్ సర్కిల్ నుండి భీమిలి బీచ్ వరకు వాహనాల రాకపోకలను నిషేధించారు. తగరపువలస జంక్షన్ నుండి భీమిలి వైపు, ఆనందపురం ఫ్లై ఓవర్ నుండి విశాఖపట్నం సిటీలోనికి, పెందుర్తి జంక్షన్ నుండి సిటీ లోకి,భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. ఈ వాహనాలు నేరుగా ఆనందపురం జంక్షన్ నుండి పెందుర్తి అనకాపల్లి మార్గంలో వెళ్లాలని అధికారులు సూచించారు. విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి పాత పోస్ట్ ఆఫీస్ షిప్పింగ్ హార్బర్ వైపు భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. అనకాపల్లి వైపు నుండి వచ్చే వాహనాలు సబ్బవరం పెందుర్తి ఆనందపురం హైవే మీదుగా మళ్ళించడం జరుగుతుందని . విశాఖపట్నం పోర్టు నుండి బయటకు వెళ్లే భారీ వాహనాలు షీలానగర్ సబ్బవరం మీదుగా నేషనల్ హైవే లోకి ప్రవేశించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ నగరంలోకి ప్రవేశించడానికి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు

మద్దిలపాలెం ఇంజనీరింగ్ కళాశాల ఆర్చి నుండి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వైపు విఐపి వాహనాల తప్ప, ఇతర వాహనాలకు, పాదచారులకు అనుమతి లేదని, ఆర్కే బీచ్ నుండి భీమిలి వరకు మధ్య గల బీచ్ రోడ్‌ను ఆనుకొని ఉన్న వివిధ కాలనీలలో నివాసం ఉంటున్న ప్రజలు 20వ తేదీ రాత్రి 12 గంటల నుండి 21వ తేదీ రాత్రి 12 గంటల వరకు ఎటువంటి వాహనాల ద్వారా బీచ్‌లోనికి ప్రవేశించరాదని అధికారులు తెలిపారు. ఏదైనా అత్యవసరమైతే తప్ప వాహనాన్ని వాడరాదని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాల్సి ఉంటుందని అధికారులు కోరారు.

ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

వెంకటరావును అభినందిస్తున్న ఎంఆర్‌పిఎస్ నేతలు

ప్రజాశక్తి- పాయకరావుపేట : వచ్చేనెల 7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని, వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకను ఘనంగా నిర్వహించాలని అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి పోచపల్లి వెంకటరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మంగవరంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, ఆవిర్భావ దినోత్సవం రోజున ఊరూరా ఎంఆర్‌పిఎస్ జెండాలను ఆవిష్కరించాలన్నారు. మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో ఎబిసి వర్గీకరణ సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంపల చినరాజు, ఎంఎస్‌సి అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్న అప్పారావు, ఎలమంచిలి ఇంఛార్జి కుందూరు ప్రవీణ్ కుమార్, ఆరుగుల రమేష్, బొడ్డపాటి సతీష్, ఆరుగుల మోసే, బొడ్డపాటి రాజుబాబు, దూలపల్లి నానాజీ పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో నూతనంగా ఏర్పడ్డ గ్రామపంచాయతీలకు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎస్ఎన్.రాజు చొరవతో నియామకాలు చేపట్టారు. టి అర్జాపురం గ్రామపంచాయతీ నుంచి విడిపోయిన కొట్లాబిల్లి పంచాయతీ లోని కొట్లాబిల్లి గ్రామానికి అరిగెల ప్రసాద్‌ను, కన్నంపేట పంచాయితీ నుంచి విడిపోయి కొత్త గ్రామపంచాయతీగా ఏర్పడ్డ వోమ్మవరం గ్రామానికి ఫీల్డ్ అసిస్టెంట్ ఉండడంతో, కన్నంపేట గ్రామపంచాయతీలో ఏర్పడ్డ ఖాళీస్థానంలో కన్నంపేట ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఆ గ్రామానికి చెందిన సేనాపతి పద్మను నియమించారు. అలాగే టి. అర్జాపురం గ్రామానికి ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉండగా, ఒకరు ఖాళీగా ఉండగా, ఆ స్థానంలో రెండవ ఫీల్డ్ అసిస్టెంట్‌గా మచ్చ వెంకటలక్ష్మిని నియమించారు. వీరందరికీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, కొత్తగా నియమితులైన ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్లు అంకితభావంతో కష్టపడి పనిచేసి, గ్రామానికి, మండలానికి, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. గ్రామాల్లో అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు ఇవ్వడంతోపాటు జాబ్‌కార్డులున్నవారికి పని కల్పించాలని సూచించారు.

నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

విధి నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకన్న బాబు, ఎఒ సీతారామస్వామి, ఎపిఒ చిన్నారావు, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు రాజాన శ్రీవాణి కొండనాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రామాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని జానకిరాంపురం గ్రామంలో శ్రీకోదండరామస్వామి ఆలయ చతుర్థ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం కోదండరామ స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం పుష్పయాగం నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం వద్ద పండుగ సందడి నెలకొంది.

యోగా ప్రొటోకాల్‌పై శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి హాకీ గ్రౌండ్‌లో గురువారం ఉదయం తైక్వాండో, బాక్సింగ్, హాకీ క్రీడాకారులకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కామన్ యోగా ప్రోటోకాల్‌పై యోగా గురువు దవరసింగి రాంబాబు, హైస్కూల్ పీడి లక్ష్మి శిక్షణ ఇచ్చారు. హైస్కూల్ హెచ్‌ఎం విజయ, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వెంకటేష్, టైక్వాండో ,బాక్సింగ్ హాకీ కోచ్ లు పాల్గొన్నారు. సాయంత్రం ఎంపిడిఒ సీతారామరాజు, తహశీల్దార్ నరసింహమూర్తి, ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ రఘు, ప్రిన్సిపల్ శ్రీదేవి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రోటోకాల్ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.

పెదబోదుగల్లం హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.జయశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రైనీమాస్టర్ ఎన్‌విఎస్ ఆచార్యులు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫాతి మున్నీషా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావికమతం: . యోగాంధ్రలో భాగంగా రావికమతం మండల పరిషత్తు ఆవరణలో గురువారం

రావికమతంలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

ఏవో సీతారామస్వామి, ఇఒపిఆర్‌డి భానోజీరావు, ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనానికి, శారీరక, మానసిక ప్రశాంతతకు యోగా అవసరమన్నారు. మంచి ఆరోగ్యానికి ప్రతిరోజు 40 నిమిషాల పాటు యోగాను చేయాలన్నారు. 21న విశాఖపట్నంలో యోగా దినోత్సవానికి పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు రాజాన శ్రీవాణి కొండ నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు మై చర్ల నాయుడు, రావికమతం సర్పంచ్ గంజి మోదినాయుడు, పాల్గొన్నారు.

వేపగుంట : అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతానికి పెందుర్తి మండల ఉన్నతాధికారులతో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. సుజాతనగర్ దాట్ల మాన్సాన్స్ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జోనల్ కమిషనర్ హైమావతి, ఎంపిడిఒ అప్పలరాజు, ఎపిఎం ఎస్తేరు రాణి, ఎపిడిఒ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆయుష్ ఆర్‌డిడి ఝాన్సీ లక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ యోగ దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యాన ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి ఆధ్వర్యాన యోగాపై అవగాహన కల్పించామని చెప్పారు.

తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి, అధ్యాపకులు, విద్యార్థులు

నక్కపల్లిలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని తర్లువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర లోగోను విద్యార్థులు ప్రదర్శించారు. పీడీ పొన్నాడ మాధవరావు ఆధ్వర్యాన ప్రధానోపాధ్యాయులు పి. జ్యోతి మార్గదర్శనంలో ఎంతో ఉత్తేజంగా నిర్వహించారు.150 మంది విద్యార్థులు యోగా ఆసనాలు ప్రదర్శించారు.

పద్మనాభం : మండలంలోని 22 గ్రామ పంచాయతీల నుంచి 7000 మందిని యోగా ఆంధ్రాలో పాల్గొనేలా చూడాలని మండల ఉన్నతాధికారులకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. యోగాంధ్రను విజయవంతం చేయడంలో భాగంగా కోఆర్డినేషన్ సమావేశాన్ని మండల సమావేశ మందిరంలో నిర్వహించారు. యోగాంధ్ర ఇన్‌చార్జి జివి.ఆంజనేయులు, టిడిపి నాయకులు కె.రమణ, జనసేన నాయకులు పి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : దక్షిణ నియోజకవర్గం నుంచి కనీసం 40 వేల మంది హాజరయ్యేలా అన్నీ చర్యలు చేపట్టామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ తెలిపారు. ప్రతి వార్డు నుండీ 2400మందికి తగ్గకుండా యోగాలో భాగస్వామ్యం అయ్యేలా కసరత్తు చేశామని పేర్కొన్నారు

యోగాంధ్రకు స్కూల్ బస్సులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈనెల 21న విశాఖ సాగరతీరంలో నిర్వహించనున్న యోగ ప్రదర్శనకు జనసమీకరణకు స్కూల్ బస్సులు తరలివెళ్లాయి. రాష్ట్ర పభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర పేరిట ఈనెల 21న విశాఖ బీచ్‌లో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల విశాఖలో సమావేశం నిర్వహించి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులకు జనసమీకరణపై దిశా నిర్దేశం చేశారు.

ఐదు లక్షల మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించి, గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించడమే లక్ష్యంతో చేపట్టే ఈ క్రతువుకు గురువారం కాకినాడ జిల్లాతో పాటు రాజమండ్రి నుండి పలు ప్రైవేట్ పాఠశాలల స్కూలు బస్సులు విశాఖకు క్యూ కట్టాయి. ఒక్కసారిగా స్కూల్ బస్సులన్నీ తరలివెళుతుండడంతో నక్కపల్లి జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇప్పటికే మండలంలోని ఉద్యోగులకు, పలువురు విద్యార్థులకు యోగ ప్రోటోకాల్‌పై శిక్షణ ఇచ్చారు. శుక్రవారం వీరందరినీ బస్సుల్లో విశాఖ తరలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

పక్క జిల్లాల నుంచి క్యూకట్టి వెలుతున్న స్కూల్ బస్సులు

పరిహారం చెల్లించే వరకూ పనులు చేపట్టొద్దు

- కారిడార్ పనులు అడ్డగించిన అమలాపురం మత్స్యకారులు
- సొసైటీ భూములకూ పరిహారం చెల్లించాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వేంపాడు రెవిన్యూ అమలాపురంలోని కనకమహాలక్ష్మి మత్స్యకార సొసైటీ భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు ఆందోళన బాట పట్టారు. గురువారం ఫిషర్‌మెన్ సొసైటీకి చెందిన భూములో చేపడుతున్న పనులను అడ్డగించి, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బైఠాయించి ధర్నా చేపట్టారు. పెద్ద సంఖ్యలో మత్స్యకారులు,మహిళలు తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. పరిహారం చెల్లించే వరకు పనులు అడ్డగిస్తామని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఎపిఐఐసి అధికారులు అమలాపురంలో కనకమహాలక్ష్మి ఫిషర్‌మెన్ సొసైటీకి చెందిన 43.15 ఎకరాల భూమిని సేకరించారన్నారు. ఆ భూములకు పరిహారం చెల్లిస్తామని హామీలిచ్చిన అధికారులు, నేటి వరకు ఆ ఊసెత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకార సొసైటీ భూములకు కూడా పరిహారం చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామని, అంతవరకు పనులు అడ్డగిస్తామని ముక్తకంఠంతో స్పష్టం చేశారు. సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు ఆందోళనకారులతో మాట్లాడారు. ఆందోళనలో పెద్ద సంఖ్యలో మత్సకారులు, మహిళలు పాల్గొన్నారు.

తల్లికి వందనం వర్తింపజేయాలి

అధికారులకు అంగన్వాడీల వినతి

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి -నక్కపల్లి : తమకు 'తల్లికి వందనం', ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. గురువారం అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ సీతారామరాజు, తహశీల్దార్ నరసింహమూర్తిలను కలిసి వినతిపత్రం అందజేశారు. తాము ప్రభుత్వ ఉద్యోగులం కాదని, గౌరవ వేతనం తీసుకుని విధులు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్వాడీలకు తల్లికి వందనంతో పాటు, ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్తింప చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

దీక్షలో పాల్గొన్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పదేళ్లు నిండిన కార్మికుల సర్వీసు క్రమబద్ధీకరణ, కనీసవేతనాల అమలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగపు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ, నర్సీపట్నం విభాగం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు ఈ సందర్భంగా జెఎసి అధ్యక్షులు మాకిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ అత్యవసర విభాగమైన నీటి సరఫరా, వీధి దీపాలు, పార్కుల నిర్వహణ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు స్కిల్డ్ కార్మికులకు రూ. 29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 నెలసరి కనీస వేతనం అమలు చేయాలని, పదేళ్ళ పైబడి పనిచేస్తున్న ఇంజనీరింగ్ మున్సిపల్ కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించాలని, హెచ్‌ఆర్ పాలసీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, ఆఫ్కాస్ రద్దు, ఉద్యోగ విరమణ వయస్సును 60ఏళ్ల నుంచి 62ఏళ్లకు పెంపు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇతర ఉద్యోగుల మాదిరిగా గ్రాడ్యూటీతో పాటు కనీస పెన్షన్ రూ.పది వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కరక మహేష్, ఉపాధ్యక్షులు యర్రా ప్రకాష్, కోశాధికారి లాలం నాగేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా రామచంద్ర జన్మదిన వేడుక

కేకు కట్ చేస్తున్న రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి- పాయకరావుపేట : భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ పుట్టినరోజు వేడుకలు బుధవారం రాత్రి పాయకరావుపేటలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ యువ నాయకుడు కొర్ని నానీ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో బర్త్ డే కేక్ కట్ చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బాణా సంచా కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా కొర్ని నానీ యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి రామచంద్ర యాదవ్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కొని యాడారు. రామచంద్ర యాదవ్ వెంటే తామంతా నడుస్తామన్నారు. కార్యక్రమంలో కుండల చక్క రావు, కుండల గోవిందు, పట్నాల సంతోష్ , మఠం శ్రీను, పల్లా తాసు, వరహాలు, చిన్న, శివ, జాన్, అప్పల రాజు, నరేంద్ర, నవీన్, కుండల నాగు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో క్రీడా మైదానాలకు మరమ్మతులు

క్రీడామైదానాన్ని బాగు చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలో ఉపాధి హామీ నిధులతో సువిశాల క్రీడా మైదానాలను శరవేగం బాగు చేస్తున్నారు, విశాలమైన క్రీడా మైదానం కావడంతో అన్ని వర్గాల క్రీడాకారులు మార్నింగ్ వాకర్స్‌తో రద్దీగా ఉంటుంది క్రీడా మైదానం అభివృద్ధి చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు, వాకింగ్ సమయంలో తుప్పలు కారణంగా విష సర్పాలు సంచరిస్తాయని తీవ్ర ఆందోళన చెందేవారు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం తుప్పలు తొలగించడం, ఇతర అభివృద్ధి పనుల చేస్తుండడంతో ఎ క్రీడాకారులు వాకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు,ఉపాధి నిధులతో వాకింగ్ ర్యాంపు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు

చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాసరాజు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో గురువారం ఎంకె.పట్నం, లోసింగి, అర్ల గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో 102 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 11 మంది రోగులు జ్వర బాధితులుగా గుర్తించి మందులు పంపిణీ చేశారు. అనంతరం టైఫాయిడ్, డెంగీ, డయేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా పలు సూచనలు చేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమతెరలు వినియోగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ నూకరాజు, ఎంఎల్‌హెచ్‌పి పార్వతి, హెల్త్ అసిస్టెంట్ అప్పారావు, ఎఎన్ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు సరఫరా చేయాలి

రైతులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి-గొలుగొండ : రైతులకు సకాలంలో విత్తనాలు సరఫరా చేయాలని సీపీఐ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మేకా సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం సీహెచ్.నాగాపురంలో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో రైతులు విత్తనాలు నిల్వ చేసుకోలేకపోయారన్నారు. రైతులకు ఏ రకం విత్తనాలు కావాలో తెలుసుకుని, దానికి అనుగుణంగా అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కానీ ఇప్పటివరకు ఏ అధికారి వచ్చి విత్తనాలు కావాలని రైతులను అడగలేదని అంటున్నారన్నారు. ఇప్పటికైనా రైతులకు అవసరమైన వరి విత్తనాలను తక్షణమే సరఫరా చేయాలన్నారు కార్యక్రమంలో పోకనాటి నాగభూషణం, కొలగానీ అప్పారావు, లంక అప్పారావు, పళ్ళ సత్తిబాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు

క్రీడాకారులకు క్రికెట్ కిట్ పంపిణీ

క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేస్తున్న శంకర్

ప్రజాశక్తి -నక్కపల్లి : కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నక్కపల్లిలో ఘనంగా నిర్వహించారు. గురువారం. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మేడేటి శంకర్ ఆధ్వర్యంలో బర్త్‌డే కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. నక్కపల్లి పంచాయతీ, అప్పల పాయకరావుపేటకు చెందిన క్రికెట్ క్రీడాకారులకు రూ.పదివేల విలువైన క్రికెట్ కిట్‌ను అందజేసారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నీలి అశోక్ తదితరులు పాల్గొన్నారు.